# ''గిలిగింత''

లీలా ప్రసాద్, జలజల వివాహం చాలా ఆర్భాటంగా జరిగింది.

ఎప్పటినుంచో ఎదురు చూస్తూ వచ్చిన ఆ మొదటి రాత్రి రానే వచ్చింది. ఎదురు చూసిందంతా పాపం ఆ లీలా ప్రసాదే. ఎందుకంటే అతని వయస్సు ఇప్పుడు ఇరవై ఎనిమిది. ఆ లేత అమ్మాయికి పందొమ్మిదే ఇంకా నిండలేదు. అందుకే ఎదురు చూస్తూ వుండడానికి తగిన వయస్సు ఇంకా ఆమెకు రాలేదనే చెప్పవచ్చు.

సిగ్గు అనేది ఆడవాళ్లకు మాత్రమే స్వంతమైనది కాదు. లీలాప్రసాద్‌కు కూడా బాగా సిగ్గు వుండేది. పెళ్లి చూపుల సమయంలో, జలజవైపు ధైర్యంగా చూడడానికి అతనికి ధైర్యం చాలలేదు - విశేషించి తన పితృశ్రీ ప్రక్కన కూర్చునేడప్పుడు. అందుకే ఈ సందర్భంలో గూడా, - అంటే --- మూసిపెట్టిన తలుపులు కిటికీలలో తనూ జలజ మాత్రమే ఉన్న ఈ సమయంలో కూడా...

ఒక మగ ఆడ మధ్యలో మామూలుగా వుండే ఒక రకం ఆశలపరంగా వినిమయ (exchange) లోపం లేదనికాదు. తప్పకుండా వుంది అని చెప్పడమే వాస్తవం.

అతనికి దేనిపైనో ఆత్రంగా ఉంది. గొంతు ఎండిపోతుంది. పాలు తాగాడు. ఆమెకు ఇచ్చాడు. తాగుండా ఆమె ప్రక్కన పెట్టింది. చాలాసార్లు అతను నీళ్లు త్రాగాడు. అయినా దాహం. ఎన్నెన్నో రకాల దాహం. కాని -

ఆమెతో మట్లాడాలి. కానీ, ఏమడగాలి? ముక్కుతూ, మూల్గుతూ ఏమేమో అడిగాడు. సింగిల్ మూలుగులో ''అవును'' అని, డబుల్ మూలుగులో ''కాదు'' అని సమాధానం వచ్చింది.

అవసరమొస్తే గాడిద కాళ్లు కూడా పట్టుకోవాలని అతనికి తెలుసు. ఆమె పాదాల వైపు ఆహా! అవి ఎంత అందంగా వున్నాయి! పాదకమలం, పాద పద్మం. పాద సరసీరుహం అని చెప్పేది వీటి గురించే కాబోలు. ఒకసారి పట్టుకుంటే? ఛీ! ఛీ! అవమాన కరం. మొదటిరాత్రిలోనే వరుడు, వధువు కాళ్లు పట్టుకున్నాడని చెబితే ఎంత పరువు తక్కువ. మామూలుగా సినిమాలో చూస్తున్నట్టు పతిదేవుడి పాదాలకు నమస్కరించి, ఆపాద ధూళిని తన పాపిడిలో పెట్టుకొని నా 'అభయస్థానమిదే' అని ప్రార్థనా స్వరంలో చెప్పే పాతరకపు భారతనారి కాదు ఈ జలజ.

మెల్లగా, ఇంకా దగ్గరకు కూర్చుని ఆమె కుడి చేతి వ్రేళ్లను ఒకసారి స్పర్శించాడు. విద్యుద్ఘాతం సోకినట్లు వులిక్కిపడి ప్రక్కకు జరిగింది జలజ.

దానితో ఆ రాత్రి ముఖ్య కార్యక్రమాలు ముగిసినాయి. మంచానికి ఒక ప్రక్కగా గోడకు అభిముఖంగా పడుకొని, జలజ నిద్రపోయింది. లీలాప్రసాద్‌కు కొంచెంగూడా నిద్రాప్రాప్తి లభించలేదు.

మరో ఆరు రోజులలో ఆశలపరంగా వినిమయ రంగం కొంచెం మెరుగుపడింది కాని, స్పర్శపరంగా ఏ మాత్రం పురోగతి అతను సాధించలేదు. ''వివాహానంతరం కూడా బ్రహ్మచారి''గా గడుపుతున్న లీలా రహిత ప్రసాదుకు కూడా రాత్రులలో నిద్రరావటం మొదలయింది. కాని, వైవాహిక జీవితం అతని హిత సుఖజీవితానికి అనుగుణంగా ముందుకు సాగకపోతే? ఇంకా ముందుకు పోవడంలో ఏ లాభం ఉంది?

గత్యంతరం లేక, లీలాప్రసాద్ తన దుర్భర రాత్రుల గురించి, అన్న రాజేంద్రప్రసాద్ ధర్మపత్నియైన చంద్రిక వదినతో కాక, వేరే ఎవరితో చర్చిస్తాడు? వయసు మళ్లిన తల్లిదండ్రులతో దీన్ని గురించి ప్రస్తావించడమే బాగుండదు. అన్న రాజేంద్రప్రసాద్ అయితే, తానో భారత రాష్ట్రపతిగా వ్యవహరిస్తుంటాడు. తనలాంటి క్షుద్ర ప్రాణులతో అతను మాట్లాడుతాడా! ఆ ఇంట్లో లీలాప్రసాద్‌కు చాలా సన్నిహితంగా వుండేది అతని వదిన మాత్రమే. అతని మొదటిరాత్రి జరిగిన మరునాడు ఉదయం చంద్రిక వదిన అతనితో అడిగింది - ''ఏం లీలా! కాయను జారవిడుచుకున్న ఉడుతలాగా, మొహం పెట్టుకున్నావు? ఎందకు?'' అని. అప్పుడు అతనికి ఏం సమాధానం చెప్పాలో అని అర్థం కాలేదు. తరువాత రోజుల్లో గూడా, ఆ చిలిపి వదిన ఆటపట్టిస్తూ, అతని విషణ్ణవదనం గురించి అడగడం మానలేదు.

ఏడురోజుల తర్వాత అతను చంద్రిక వదినతో అన్ని విషయాలు స్పష్టంగా చెప్పాడు.

''ఇది చాలా జటిలమైన ప్రశ్నే. ఏమైనా కూడా నువ్వు బాధపడవద్దు. ఆమెతో నేనొకసారి మాట్లాడి చూస్తా'' అని చెప్పి అతన్ని సమాధాన పరచింది.

సాయంత్రం అతను ఆఫీసు నుంచి రాగానే చంద్రిక వదిన తనగదికి అతన్ని తీసుకెళ్లి ఒకటే నవ్వు మొదలు పెట్టింది. అతనికి ఏం అర్థం కాలేదు.

''పెద్ద చిక్కు ప్రశ్న ఏమీ లేదు. లీలా! జలజ సమస్య ఏమిటో నీకేమీ అర్థం కాలేదు. అసలు నువ్వడిగితే గదా. దాని గురించి ఆమె చెప్పేది, ఆమెకు శరీరమంతా గిలిగింతేనట. ఎక్కడ ముట్టినా ఆమెకు గిలిగింత కలుగుతుంది. నేను ఆమెను చాలా చోట్ల గిలిగింత పెట్టి చూశాను. పాపం, అది ఆమె తప్పేమి కాదు... అందుకే, ఆమెను మొత్తంగా కౌగలించుకోవడం గాని, ముద్దుపెట్టుకోవడం గాని చేసుకో. కాని, నీ వ్రేలి కొసతో ఆమె శరీర భాగంలో ఎక్కడా కూడా ముట్టుకోడవం గాని,

ముట్టుకోబోవడం గాని జరిగితే ఆమెకు గిలగింత కలుగుతుంది. అవి కూడా మామూలు గలిగింతలు కావు. అవునూ, నీకెందుకు భయం. ఆమె నీ భార్యకదా. ఆమెకు నీవంటే చాల ప్రేమ. నీలాంటి ఒక జెంటిల్ మాన్‌ని, ఈరోజుల్లో చూడడానికి కూడా దొరకడని ఆమె అభిప్రాయం. అందుకే ఆ జంటిల్‌మ్యాన్‌ని ప్రక్కన బెట్టి, ఈరోజు నుంచి భర్తగా నీ మ్యాన్లీనెస్‌ను చూపించు'' అని ఉపదేశించి ఆమె మళ్లీ కొంచెం సేపు నవ్వింది.

ఆ రాత్రి లీలా, జలజను నిద్రపోనివ్వలేదు. మరుసటి రోజు నుంచి ఆమె సరియైన భార్యగా మారింది.

ఇంకో పదినెలల లోపల జలజ తన పతి దేవుడికి ఒక పుత్రుడిని ప్రసాదించింది. లీలకు జలజంటే ప్రాణం. జలజకు లీలంటే ప్రాణం. కాని, వాళ్లిద్దరి మధ్యలో ఇప్పుడు ప్రాణానికి ప్రాణం చిన్నారి ప్రసాద్. జీవితం ఏంతో ఆనందమయంగా ముందుకు సాగుతోంది.

బాబు నామకరణ మహోత్సవం చాలా ఆడంబరంగా జరిగింది. బాబు పుట్టిన రోజు నుంచి, ప్రతిరోజూ లీలా ప్రసాద్ తన కెమేరాతో బాబు ఫొటోలు తీసేవాడు. ఇప్పుడు బాబుకు ఐదు నెలలు నిండాయి. ఇంతలోపల ఐదు ఆల్బములు కూడా ఫొటోలతో నిండాయి.

జలజైతే బిడ్డను కిందకు దించడానికే సమయం లేదు. లీలాప్రసాద్‌కు ఒక క్రొత్త అనుమానం - బిడ్డ పుట్టిన తర్వాత జలజకు తనపై ప్రేమేమైనా తగ్గిందా. ఆమెను అడిగితే అంత తేలికగా ఒప్పుకుంటుందా? చంద్రిక వదిన నడిగినప్పుడు ''కొద్దిగ ఓపికపట్టు. ఇంకొక బిడ్డ కూడా పుట్టిన తరువాతనే ఆమె నిన్ను తిరిగి చూస్తుంది. ఇప్పుడు ఆ రాజ కుమారుడిని చూడటానికే సమయం చాలదని ఆమెకు అనిపిస్తుంది. ఇంకొక రాజ కుమారుడుగాని, రాజ కుమార్తెగాని వచ్చిన తర్వాత, రాజుగారికి మళ్లీ కావాల్సిన సేవలన్నీ అందుతాయి. అంతవరకు కొంచెం ఓపిగ్గా వుండు'' అని నవ్వుకొని చెప్పింది.

జలజ గర్భవతిగా వున్నప్పుడు కూడా వారిద్దరూ అప్పుడప్పుడూ బయటకు వెళ్లేవారు. చంద్రిక వదిన సలహావల్ల డాక్టరుగారి సలహావల్ల మామూలుగా విందులలో పాల్గొనటం వాళ్లకు చాలా ప్రియమైన కార్యక్రమం.

కాని, ఈ చిన్నాయ్ పుట్టిన తర్వాత వాళ్లింతవఱకు ఒకసారి కూడా బయటకు వెళ్లలేదు. ఇది ఆరో నెల.

ఒక ఆదివారం రోజు లీలాప్రసాద్ చాలా దగ్గరైన ఒక మిత్రుడి ఇంట్లో రాత్రి విందుకు ఆహ్వానం వచ్చింది.

''బాబును వదిలిపెట్టి నేను ఎక్కడికి రావటం లేదు'' అని జలజ కరాఖండిగ చెప్పింది.

బాబును కూడా వాళ్లు ప్రత్యేకంగా ఆహ్వానించారు. బుజ్జిగాణ్ణి ముద్దుగా తయారు జేసి, అతని పాలసీసా అన్నీ తీసుకొని 'మనం అలా బయటకు వెళ్తున్నాం కదరా బాబూ?'' అని అంటూ పైకి ఎగరేసి, మరీ పట్టుకొని, తన చుట్టూ గిరగిరా తిప్పుకున్నాడు.

''అయ్యో, అయ్యో, బాబు ఇప్పుడే పాలు త్రాగాడు. అదంతా ఇప్పుడు బయటకు వస్తుంది'' అని ఆమె చిరుకోపంతో గొణిగింది.

ఏమైనా, త్వరగా వెళ్లి త్వరగా తిరిగి వద్దామనే ఒప్పందంమీద వాళ్లు సాయంత్రం ఐదు గంటలకు తమ 'హమారా బజాజ్'లో బయలు దేరారు.

బాబును అందంగా అలంకరించి తయారు చేశారు. దృష్టి దోషం తగలకుండా అతని కుడి చెంపకు, నల్ల చుక్క బొట్టు పెట్టడం ఆమె మరచిపోలేదు. ఇంపోర్టెడ్ నాపీ సెట్ మెత్తలాంటి చొక్కా, మెత్తని టోపీ, ఇవన్నీ వేసేటప్పటికి అతను ఒక ఎస్కిమో వాడిలాగా వున్నాడని లీలాప్రసాద్ చెప్పాడు. కాదు, వీరపాండ్య కట్టబ్రమ్మన లాగ వున్నాడని జలజ చెప్పింది. రెండు కూడా కాదు, ఇతను ఒక ''మూన్‌వాకర్'' లాగ వున్నాడని, చంద్రిక వదిన వాళ్లిద్దరిని ఓవర్ రూల్ చేసింది.

బాబుకు ఇది మొదటి పట్టణ ప్రవేశం. అతని ముఖానికి ఎక్కువ గాలి తగిలితే వూపిరి తీసుకోవటం కష్టమౌతుందని చంద్రిక వదిన ముందు జాగ్రత్తగా చెప్పింది.

''నేను స్కూటర్ చాలా మెల్లగానే నడుపుతాను. మొత్తం ఒక ఐదు కిలోమీటర్లే కదా. బాబును చాలా గట్టిగా పట్టుకోవాలి జలజా'' అని చెబుతూ లీలాప్రసాద్ ఒక ఐదు లేక పది కిలోమీటర్ల స్పీడుతో స్కూటర్ నడపటం మొదలు పెట్టాడు.

''ఛీ! ఛీ! ఇంత మెల్లగా పోవడమెందుకండీ. ఇంకొంచెం స్పీడు పెంచండి. బాబు మొహానికి గాలి ఎక్కువ తగలకుండా నేను చూసుకుంటా'' అని జలజ చెప్పింది. తరువాత స్కూటర్ పదిహేను నుంచి ఇరవై కిలోమీటర్ల స్పీడులో ముందుకు వెళ్లింది. దాదాపు మూడున్నర కిలోమీటర్లు దాటి వుండవచ్చు. లీలా, జలజలు దారిపొడుగునా మాట్లాడుతూనే వున్నారు. దానితోపాటు పిల్లవాడి కేరింతలు కూడా ముచ్చటించు కున్నారు. ఆ చిన్నవాడికి తన మొదటి ప్రయాణం బాగా నచ్చినట్లు వుంది. జలజ తన కుడిచేతిని, లీలాప్రసాద్ పొట్టపైన వుంచి పట్టుకుంది. ఎడమ చేతిలో బిడ్డను తన యెదకు గట్టిగా అదుముకుంది.

నవ్వుతూ, మాట్లాడుతూ, ముందుకు సాగిపోతున్నారు. పెద్ద స్పీడుగా వెళ్లటం లేదు. దానికి కారణం. జనం రద్దీ ఎక్కువ అవటంవల్ల బ్రేకు మీదనుంచి కాలు తీయాటానికే వీలు కావటం లేదు.

''అయ్యో, బాబు, నాబాబు అనే ఒక పెద్ద అరుపుతో జలజ తన కుడిచేతిలో, అతని పొట్టను గట్టిగా పిసికింది. అదే సమయంలో, ఆమె ఎడమ చేయి, అతని గొంతుచుట్టూ పెనవేసి వెనకకు లాగింది. ఒక్క వులికిపాటుతో స్కూటరును ఆయన ఒక ప్రక్కను ఆపాడు. స్కూటర్ ఆగే ముందు గానే ఆమె దూకడంతో అదుపు తప్పి, రోడ్డుపై కిందపడి వెంటనే లేచి, పిచ్చిదాని మాదిరి వెనుకకు పరిగెత్తింది. అంతలోపల, రోడ్డుపై దొర్లుకుంటూ పోతున్న, ఆ శిశువును, ఎవరో ఒక అతను వెంటనే తన చేతుల్లోకి తీసేసుకున్నాడు. అతని చేతుల్లోంచి బాబును లాక్కువి, ''బాబూ, నా బాబూ అని ఆమె హృదయం పగిలేటట్లు ఏడ్చింది. పాపం, ఆ పిల్లవాడు, స్పృహ తప్పి వున్నాడు. స్కూటర్ ప్రక్కన పెట్టి, పరుగెత్తుకొచ్చి, బాబును లాక్కోవడానికి లీలాప్రసాద్ ప్రయత్నించినా ఆమె వదలలేదు. స్కూటరుకు సరాసరి వెనుకగా వచ్చిన ఒక మారుతీ కారు, పిల్లవాడు రోడ్డుపై పడడం చూసి సడన్ బ్రేకుతో ఆగింది. దానితో, కొన్ని సైకిళ్లు, కొన్ని స్కూటర్లు పాద సంచారులకు కూడా బ్రేకు పడింది. ఎక్కువ గుంపు గుమిగూడేముందు, కారువాడు, పెద్దగా ఏడుస్తున్న జలజను, ప్రసాదును తన కారులో ఎక్కించుకొని ఐదు నిముషాల్లోపల దగ్గర ఉన్న ఒక డాక్టరు క్లినిక్‌లో చేర్పించాడు.

ఇంకో మూడు నిముషాల్లో బాబు ఏడ్చాడు. దానితో జలజ ప్రాణం తిరిగి వచ్చింది. డాక్టరు చెప్పాడు - ''బాబుకు ఏం కాలేదు. సడన్ గా కింద పడడం వల్ల షాక్ అయింది. 'హిఈజ్ అబ్సల్యూట్లీ నార్మల్' మీరెంతో అదృష్టవంతులు. ఏమైనా జరిగి వుండవచ్చు గదా.''

బాబు పడిపోయిన చోట గుమికూడిన జనం తమ తమ కల్పనా ప్రతిభకు తగిన అభిప్రాయాలు వెలిబుచ్చారు.

''వాళ్లిద్దరూ బాగా తాగి వచ్చుంటారు. వయసటువంటిదే గదా. కాని, ఇలాంటి పనికి వెళ్లేటప్పుడు ఆ చిన్న బిడ్డనెందుకు తీసుకెళ్లాలి?''

''వాళ్లింట్లో బిడ్డను చూసుకోవటానికి ఎవరూ లేరేమో''.

''వాళ్లేమైనా తమాషా చెప్పుకుంటూ నవ్వేటప్పుడు బిడ్డ పడిపోయాడేమో!'' అని ఇంకొకరు అభిప్రాయం.

''స్కూటర్, బహుశః ఏదైనా రాయిపైన ఎక్కిందా లేక గుంతలో పడిందేమో'' అని ఒక మంచివాడు అభిప్రాయ పడ్డాడు.

''గుంతా నీ తల కాయలో ఉంది. ఈ ఫస్ట్‌క్లాస్ రోడ్డులో రాళ్లు, గుంతలు ఎక్కడున్నాయి?'' అని ఇంకొక బుద్ధిమంతుడు, అతణ్ణి బుద్ధి లేనివాడిగా చిత్రీకరించాడు.

''ఇదిరా లేటెస్ట్ ఫ్యామిలీ ప్లానింగ్ సూత్రం. వాళ్లకు ఈ బిడ్డ అక్కర లేదేమో. మరీ చిన్న వయసు కదా?''

కొంత మంది నవ్వారు. ఇంకొంతమందికి అతన్ని గొంతు పిసికి చంపేయాలనిపించింది.

ఏమైనా గూడా సంఘటన జరిగింది ఈ ప్రకారంగా -

జలజ యెద దగ్గరగా హత్తుకొని కూర్చున్న బాబు కుడిచేతి వేళ్లు మెల్లగా ఆమె ఎడమ చంకలోకి వెళ్లి, ఆ ప్రదేశంలో గీకడం జరిగింది. శరీరం మొత్తం గిలిగింత వున్న, ఆ జలజ, చంకలో గీరడం జరిగిందంటే ఇంక సహించడానికి వీలే లేదు. ఆమెకు తెలియకుండానే ఆమె ఎడమ చేయి, ఒక ప్రక్కకు పైకి లేచి పోయింది. దానితో బాబు జారి కిందపడి దొర్లుకుంటూ పోయాడు. అంత రద్దీగా వున్న ఆరోడ్డులో దొర్లుతున్న ఆ శిశువుమీద వేగంగా వచ్చే ఏదైనా వాహనం, ఎక్కకుండా వుండడం ఎంతో మహాభాగ్యం.

ఏడుపును ఆపుకోలేని జలజను, లీలాప్రసాద్ కోపంతో తిట్టలేదని మాత్రం కాదు - అశ్వాసవచనాలతో ఆమెను ఓదార్చాడు. గిలిగింతను ఆమెతోపాటే పుట్టించింది ఆ దేవుడు. దానికి, ఆమెపై ఎందుకు దోషం ఆరోపించాలి.

ఇంకో రెండు, మూడు రోజులలో ఆ స్కూటర్‌ను లీలాప్రసాద్ అమ్మేశాడు. దాని స్థలంలో, మరీ పాతది కానీ, పద్మినీ ప్రీమియర్, అనే ఒక శకటం వచ్చింది. అప్పటినుంచి అదే ఆ బాబుకు ''అయా''గా సంరక్షణ ఇస్తోంది.

---